

దేశానికే ఆదర్శం
అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే పేర్కొన్నారు.
- 9లో ▸



గరిష్టం/కనిష్టం
37.1 /17.8

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

లోక్‌సభ పోరుకు సై!



బీబీ పాటిల్ (బీజేపీ)
సురేశ్ షెట్కార్ (కాంగ్రెస్)
గాలి అనిల్‌కుమార్ (బీఆర్‌ఎస్)

లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఎలక్షన్ కమిషన్ శనివారం షెడ్యూల్ విడుదల చేయనుండడంతో రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడం, ఎన్నికల తేదీపై స్పష్టత రానుండడంతో ప్రచారం సైతం ఊపందుకోనుంది.

- ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- నేడు షెడ్యూల్ ప్రకటించనున్న ఈసీ
- వేడెక్కనున్న రాజకీయాలు

సాక్షి, కామారెడ్డి : లోక్‌సభ ఎన్నికలలో సత్తా చాటడానికి ప్రధాన పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. షెడ్యూల్ వెలువడనుండడంతో ప్రచారానికి సన్నద్ధమవుతున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్ తహతహలాడుతుండగా.. మరోసారి మోదీ సర్కారు నినాదంతో బీజేపీ దూసుకెళ్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలలోనూ సత్తా చాటాలన్న వ్యూహంతో ముందుకు సాగుతోంది.

కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావడమే కాకుండా తెలంగాణలోనూ సత్తా చాటాలని చూస్తున్న బీజేపీ.. ఈసారి అందరికన్నా ముందుగా పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చరిష్మాతోపాటు అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటి అంశాల ఆధారంగా బీజేపీ నాయకత్వం జహీరాబాద్‌ను గెలుచుకునేందుకు ఎత్తుగడలు వేస్తోంది. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు కాషాయ కండువా కప్పడంతోపాటు మరుసటి రోజే అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన బీఆర్‌ఎస్ నుంచి వరుసగా రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. కాషాయ తీర్థం పుచ్చుకున్న ఆయన మూడోసారీ గెలిచి హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ తన పాత సహచరులకు బీజేపీ కండువా కప్పుతూ బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు చాలెంజ్‌గా మారాయి. అధికారంలో ఉండడంతో మెజారిటీ ఎంపీ సీట్లను గెలిపించుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. గతంలో జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన సురేశ్ షెట్కార్‌కు ఇసారి మరో అవకాశం ఇచ్చింది. ఎన్నికలలో గెలుపుకోసం ఇతర పార్టీలకు చెందిన నేతలను తమ వైపు తిప్పుకుంటూ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమితో డీలా పడిన క్యాడర్‌లో భరోసా నింపేందుకు బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గతంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రెండుసార్లు గెలిచిన చరిత్ర ఉండడంతో ఈ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని ఆ పార్టీ యోచిస్తోంది. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ పార్టీ మారడంతో కొత్త అభ్యర్థిని అన్వేషించింది. గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించింది.

ఇద్దరు పాత ప్రత్యర్థులే..
ప్రధాన పార్టీల టికెట్లు సంపాదించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు పాత ప్రత్యర్థులు కావడం గమనార్హం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్, సురేశ్ షెట్కార్‌లు 2014 ఎన్నికలలో తలపడ్డారు. ఆ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన బీబీ పాటిల్.. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌పై లక్షా 44 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మదన్‌మోహన్‌రావ్ బరిలో నిలవగా, టీఆర్‌ఎస్ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసిన బీబీ పాటిల్ 6,229 ఓట్ల తేడాతో గెలిచారు.

మొదలవనున్న ప్రచారపర్వం
అభ్యర్థులను ప్రకటించిన ఆయా పార్టీలు ప్రచారాన్ని మొదలుపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. షెడ్యూల్‌తో పాటే ప్రచారం మొదలుపెట్టేందుకు ఆయా పార్టీలు అడుగులు వేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా బరిలో ఉన్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఇద్దరూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు తెలిసిన వ్యక్తులే. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఒక్కరే పార్లమెంట్ నియోజక వర్గానికి కొత్త. బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా మాజీ మంత్రి హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు.

కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జీ ఎవరన్నది ఇంకా తేలలేదు. గతంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఇన్‌చార్జీగా ప్రకటించారు. ఆయనే ఎన్నికల బాధ్యతలు మోస్తారా లేదా మరెవరినైనా నియమిస్తారా అన్నది తేలాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చాక రాజకీయ వేడి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం..
పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ శనివారం వెలువడనుంది. ఎన్నికల కమిషన్ అధికారులు షెడ్యూల్ ప్రకటించిన వెనువెంటనే ఎలక్షన్ కోడ్ అమలులోకి వస్తుంది. కాగా ఎన్నికల కోసం నాలుగు నెలలుగా కసరత్తు కొనసాగుతోంది. మూడేళ్లకు పైగా జిల్లాలో పనిచేస్తున్న, అలాగే సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. ఎన్నికలకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు.. షెడ్యూల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కామారెడ్డి జిల్లాకు సంబంధించి కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఆయా నియోజకవర్గాల్లో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ప్రకటించారు.

న్యూస్‌రీల్

జహీరాబాద్ బీఎల్‌ఎఫ్ అభ్యర్థిగా సాయికృష్ణ



కామారెడ్డి టౌన్: జహీరాబాద్ నియోజకవర్గ బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) అభ్యర్థిగా వడ్ల సాయికృష్ణను ఆ పార్టీ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ శుక్రవారం ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రకటించారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు దండి వెంకట్, ఎస్.సిద్దిరాములు పాల్గొన్నారు.

'బుక్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోండి'
కామారెడ్డి టౌన్: డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కోసం రూ. 1,500 బుక్ ఫండ్ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చేనెల 5వ తేదీలోపు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 08462-241055, 86390 02255 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు లక్కీడ్రా



కామారెడ్డి క్రైం: బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన లక్కీడ్రాను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీడ్రాలో సుంకరి బృందన, త్రిక్షణ అనే చిన్నారులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత, జిల్లా గిరినాభివృద్ధి అధికారి అంబాజీ, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్పృహ తప్పిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



భిక్కనూరు : పెద్దమల్లారెడ్డి శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద స్పృహ కోల్పోయి పడి ఉన్న వ్యక్తిని భిక్కనూరు పోలీసులు రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. భిక్కనూరు నుంచి పెద్దమల్లారెడ్డి వెళ్లేదారిలోని వ్యవసాయ క్షేత్రంలో రోడ్డుకు అర కిలోమీటరు దూరంలో ఒక వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. కానిస్టేబుల్ యాదగిరి, హోంగార్డు రవి వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి వెళ్లారు. స్పృహ కోల్పోయిన వ్యక్తిని ఓ రైతు సహాయంతో మోసుకుంటూ రోడ్డుపైకి తీసుకువచ్చి, 108లో చేర్చారు. అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. స్పృహలోకి వచ్చిన వ్యక్తి తన పేరు భూదయ్య అని, స్వగ్రామం రామేశ్వర్‌పల్లి అని తెలిపాడు. ఆయనను 108లో భిక్కనూరు బస్టాండ్‌లో దింపారు. తనను రక్షించిన పోలీసులు, 108 సిబ్బందికి భూదయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

సర్కారు బడిలో షూటింగ్
కామారెడ్డి టౌన్: బీబీపేట మండలం మాందాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షార్ట్ ఫిల్మ్‌లోని సన్నివేశాలను చిత్రీకరించడంపై జిల్లా విద్యాశాఖ అధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం సారయ్యకు శుక్రవారం మెమో జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. రెండు వారాలుగా పాఠశాలలో షార్ట్ ఫిల్మ్ చిత్రీకరిస్తున్నారు. దీంతో తరగతుల నిర్వహణకు అంతరాయం కలుగుతోంది. అంతేకాక విద్యార్థులను సైతం ఈ షూటింగ్‌లో భాగస్వాములను చేస్తున్నారు. ఈ విషయమై డీఈవోకు ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన డీఈవో.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి మెమో జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు సైతం సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా బీబీపేట మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందిస్తానని చెప్పడంతో షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు సదరు పాఠశాల హెచ్‌ఎం వివరణ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌కు షాకిచ్చిన నేతలు


బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

- బీజేపీలో చేరిన జుక్కల్ సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్‌లు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలో బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీ నేతలు షాకిచ్చారు. పలువురు నేతలు పార్టీని వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం ముందుకు సాగుతోందన్నారు. దీంతో యావత్ ప్రపంచం మనవైపు చూస్తోందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు బీఆర్‌ఎస్‌ను వీడి, బీజేపీలో చేరామని నేతలు ప్రకటించారు. బీజేపీలో చేరినవారిలో జుక్కల్ సహకార సంఘం చైర్మన్ శివానంద్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు మాధవ్‌రావ్ దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయా గౌడ్ బస్వాపూర్, నాగుల్‌గావ్, చిన్న ఎడ్గి, మాదాపూర్, జుక్కల్, కందర్‌పల్లి, పడంపల్లి గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచులు తదితరులున్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

కామారెడ్డి క్రైం: వినియోగదారుల హక్కుల చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాటాడారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, బెట్టింగ్ లాంటి యాప్‌ల వాడకం ద్వారా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. యువత అప్రమత్తంగా ఉండాలని, అలాంటి యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. దైనందిన జీవితంలో వివిధ వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్న వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం 2019 లో వి నియోగదారుల రక్షణ చట్టం తీసుకువచ్చిందన్నా రు. ప్రధానంగా తూనికలు, కొలతల్లో మోసాలు, కల్తీ, నాణ్యత లేని వస్తువుల విక్రయం, బ్లాక్ మార్కెటింగ్ చేసి అధిక ధరలకు విక్రయించడంలాంటి మోసాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటివాటిలో ఎవరైనా నష్టపోతే పరిహారం పొందే హక్కుతో పాటు వస్తువు ఎంపిక చేసుకునే హ క్కును చట్టం కల్పిస్తోందన్నారు. వినియోగదారుడు వస్తువు కొనేముందు అన్నింటినీ పరిశీలించాలని, రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, ఉద్యానవన అధికారి విజయ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, పరిశ్రమల కేంద్రం ఏడీ రఘునందన్, ఏఎస్‌వో నిత్యానందం, వినియోగదారుల ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోదారి తీరాన వైల్డ్‌లైఫ్..


బ్యాక్ వాటర్ వద్ద ఫారెస్టు సిబ్బంది


మాట్లాడుతున్న ఆర్మూర్ ఎఫ్‌డీవో

- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వద్ద అటవీ ఉద్యోగులకు శిక్షణ
- వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించిన అధికారులు
- ఎకో టూరిజం ఏర్పాటైతే ఈ ప్రాంతం అభివృద్ధి

డొంకేశ్వర్(ఆర్మూర్): వైల్డ్ లైఫ్ అనగానే డొంకేశ్వర్ మండలంలోని నడ్కుడ, చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ గుర్తొస్తుందని, ఇలాంటి ప్రకృతి జిల్లాలో ఎక్కడా లేదని జిల్లా ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో పని చేస్తున్న బీట్ ఆఫీసర్లు, సెక్షన్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం వన్య ప్రాణుల సంరక్షణపై ఆర్మూర్ ఎఫ్‌డీవో భావానీ శంకర్, ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌లు శిక్షణ ఇస్తూ అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీళ్లు వెనక్కి వెళ్లినప్పుడు జింకలు, పక్షులు స్వేచ్ఛగా విహరిస్తాయన్నారు. వర్షాకాలంలో నీళ్లు నిండుగా ఉండడంతో ఆహారం దొరక్క పొలాల వద్దకు వస్తున్న జింకలను వీధి కుక్కలు వేటాడి చంపుతున్నాయన్నారు. వీటి రక్షణకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వన్య ప్రాణుల రక్షణకు వీధి కుక్కలను కట్టడి చేయడం ఏకైక మార్గమన్నారు. అటవీ జంతువులకు ప్రాణహాని ఉందని సమాచారం అందిన తక్షణమే సిబ్బంది స్పందించాలన్నారు. చిన్నయానం, నడ్కుడ వద్ద ఎకో టూరిజం త్వరగా ఏర్పాటైతే ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులకు కూడా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాంతానికి ప్రస్తుతం బీట్ ఆఫీసర్, వాచ్ టవర్, ఇతర సిబ్బంది ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎఫ్‌డీవో నుంచి బీట్ ఆఫీసర్ వరకు మొత్తం 120 మంది ఉద్యోగులు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ నిమిత్తం గోదావరి తీరానికి వచ్చారు. సూర్యోదయానికి ముందే వచ్చిన ఫారెస్టు అధికారులు జీజీ నడ్కుడ, చిన్నయానం, గాదేపల్లి బ్యాక్ వాటర్ వద్ద పచ్చదనంతో పరుచుకున్న ప్రకృతి అందాలను తిలకించారు. నీటిలో నుంచి అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు, ఆ సూర్యోదయం వేళ సందడి చేస్తు న్న జింకలు, పక్షులు అటవీ అధికారులను కట్టి పడేశాయి. పచ్చని గడ్డిలో అక్కడక్కడా ఉన్న నీటి కొలనుల వద్ద, నదీ ఒడ్డుపై సెల్‌ఫోన్లలో సరదాగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. శిక్షణా కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వోలు పద్మారావు, రవీందర్, వినయ్‌కుమార్, రవిమోహన్ భట్ పాల్గొన్నారు.



కవిత అరెస్టు కలకలం



ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు కావడం జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కవితను ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద అరెస్టు చేసినట్లు ఈడీ ప్రకటించింది. బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే నిర్వేదం అలుముకుంది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే ముందే కవిత అరెస్టు ఘటన బీఆర్‌ఎస్ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

- 2023 మార్చి 8, సెప్టెంబర్ 14న ఢిల్లీ లిక్కర్ స్కాంపై ఈడీ నోటీసులు
- తాజాగా నోటీసులతో పాటు అరెస్టు చేసిన ఈడీ
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ
- నేడు అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నిరసనలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేయడం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ వర్గాల్లో కలకలం సృష్టించింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కవిత అరెస్టు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది. లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఈడీ 2023 మార్చి 8న మొదటిసారి నోటీసులు జారీ చేసింది. తరువాత 2023 సెప్టెంబర్ 14న మరోసారి నోటీసులు ఇచ్చింది. తాజాగా ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో పాటు ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద అరెస్టు చేస్తున్నట్లు ఈడీ అధికారులు ప్రకటన చేయడంతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే కేవలం కొన్ని గంటల ముందే కవిత అరెస్టు ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం అన్ని నియోజకవర్గాల్లో కవిత అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ వెంటనే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కవిత అరెస్టు వ్యవహారం బీఆర్‌ఎస్ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని చెప్పవచ్చు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఢీకొట్టాల్సిన పరిస్థితుల్లో తాజా అరెస్టు కలకలం కలిగిస్తోంది.

పత్తాలేని పార్టీ జిల్లా అధ్యక్షుడు
రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత.. పార్టీ శ్రేణుల్లో నిర్వేదం అలుముకుంది. హైదరాబాద్‌లో జిల్లా పార్టీకి సంబంధించి సమీక్ష నిర్వహించిన సమయంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో కవిత ఓటమి గురించి సైతం కార్యకర్తలు ప్రస్తావించారు. కవిత ఓడిపోయిన సమయంలో ఇలాంటి సమీక్ష సమావేశాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. కవిత ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల బరిలోకి రాలేదు. జరుగబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఇన్ని పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలోనూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి జిల్లాలోకి రాకుండా పత్తా లేకుండా వెళ్లడంపై కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలయ్యాక మూడుసార్లు మాత్రమే జీవన్‌రెడ్డి నామమాత్రంగా జిల్లాకు అదీ ఆర్మూర్‌కు వచ్చి వెళ్లినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

రాజకీయ కక్షతోనే అరెస్టు



ఎమ్మెల్సీ కవిత అరెస్టు చట్ట విరుద్ధం. ఇది పూర్తిగా రాజకీయ కుట్రలో భాగం. ఆమె అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. సుప్రీం కోర్టులో అరెస్టు చేయబోమని చెప్పి, కేసు పెండింగ్‌లో ఉండగానే అదుపులోకి తీసుకోవడం సరికాదు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఈడీని పంపి కేంద్ర ప్రభుత్వం కావాలనే అరెస్టు చేయించింది. బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్ముక్కయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరకని స్థితిలో బీజేపీ, కాంగ్రెస్‌లు అయోమయంలో ఉన్నాయి. బీఆర్‌ఎస్‌ను చీల్చుతూ అభ్యర్థులను రెండు పార్టీలు కూడబలుక్కుని మాయం చేస్తున్నాయి. రాజకీయ కుట్రలను తిప్పికొడతాం. ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ సమాజం అండగా నిలుస్తుంది.
– బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

చట్టం తన పని తాను చేస్తోంది



భారత ప్రజాస్వామ్యంలో చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. కేసీఆర్ కుమార్తె కవిత లాంటివాళ్లు సమాజానికి చీడపురుగులు. ఇలాంటి వ్యక్తులు అభివృద్ధికి ప్రధాన అడ్డంకి. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి కారణంగా తెలంగాణ రెండు దశాబ్దాల వెనక్కు వెళ్లింది. కవితలాంటి వాళ్ల విషయంలో ఎంత తొందరగా నేరారోపణ రుజువు చేస్తే అంత మంచిది. దోషిగా తేలాక తక్షణమే శిక్ష ఖరారు చేసి రాజకీయాల నుంచి బయటకు పంపితేనే సమాజానికి ఉపయోగం కలుగుతుంది. కవిత లిక్కర్ కుంభకోణానికి పాల్పడడంతో తెలంగాణ సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడింది. చట్టం పని చట్టం చేసుకుంటూ వెళ్లడాన్ని ఆహ్వానించాలి.
– ధర్మపురి అర్వింద్, ఎంపీ

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట: చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న మండల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాస్ శుక్రవారం కోరారు. దరఖాస్తు చేసుకునే రైతులకు అర ఎకరం భూమితో పాటు, బోరు బావి ఉండాలన్నారు. బై బ్యాక్ కంపెనీ అగ్రిమెంట్ ఉంటుందన్నారు. సదరు యూనిట్ కేంద్రం పీఎంఈజీపీ కింద నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. 35 శాతం బ్యాకెండ్ సబ్సిడీ ఉంటుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆసక్తి గల రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



బాన్సువాడ రూరల్ : విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బోర్లంక్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మ కుమారి అన్నారు. శుక్రవారం పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా షీ టీం పీసీ ప్రియాంక ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేశ్, అధ్యాపకులు సునీత, అనిత, స్రవంతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సరైన పౌష్టికాహారం తీసుకోవాలి



నాగిరెడ్డిపేట: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉంటుందని ఎల్లారెడ్డి ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. మండలంలోని మాల్తుమ్మెద, ఎర్రారం, బంజార గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి, అంగన్‌వాడీ టీచర్లు సుగంద, శశిరేఖ, సరిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పాడి సంపదను పెంచుకోవాలి



తాడ్వాయి మండలం కన్‌కల్‌లో పశువులకు టీకా ఇస్తున్న జేడీఏ సింహారావు

తాడ్వాయి: వ్యవసాయంతో పాటు పాడి అభివృద్ధిని పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సింహారావు అన్నారు. మండలంలోని కన్‌కల్‌లో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం రైతుల కోసం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుకోవాలన్నారు. పాడి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పశుగ్రాసం పెంచి పశువులకు ఆహారంగా ఇస్తే పాలశాతం పెరుగుతుందన్నారు. పశుగ్రాస ఆవశ్యకత, పశుగ్రాసం రకాలు, ప్రభుత్వం ఇస్తున్న గడ్డి విత్తనాల రకాలపై వివరించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో సాధారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు సంజయ్, విజయ డెయిరీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, మండల వైద్యాధికారి రాంచందర్, వీఎల్‌వో పోచయ్య, జీవీవో కొండల్‌రెడ్డి, సిబ్బంది మహిపాల్‌రెడ్డి, బ్రహ్మం, ఎల్లయ్య, కార్యదర్శి సాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అడివి లింగాలలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడివి లింగాల గ్రామంలో పశువులకు శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అర్చన తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర మహబూబ్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులున్నారు.

గుర్జకుంటలో..

భిక్కనూరు : మండలంలోని గుర్జకుంటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఆహల్య, బాబు, సురేష్, ప్రదీప్,మహేష్, పంచాయతీ కార్యదర్శి రేణుకలు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

మద్నూర్(జుక్కల్) : పశు పోషకులు తమ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మేనూర్ పశువైద్యుడు బండివార్ విజయ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పశు పోషకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్థల వివాదంపై డీఎల్‌పీవో విచారణ



వివరాలు సేకరిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

దోమకొండ: మండల కేంద్రంలో స్థల వివాదంపై కామారెడ్డి డీఎల్‌పీవో శ్రీనివాస్ శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలోని పాత సిండికేట్ బ్యాంక్ వద్ద ఉన్న స్థలంపై సర్వే చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. తన సర్వే నంబర్‌లో గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జాచేసి నిర్మాణానికి యత్నిస్తున్నట్లు జడ్పీటీసీ పేర్కొన్నారు. కాగా తాను ఎలాంటి కబ్జా చేయలేదని ఈ స్థలం తనదేనని పూర్తి డాక్యుమెంట్లు ఉన్నాయంటు గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అనంతరం వివాదస్పద స్థలాన్ని డీఎల్‌పీవో పరిశీలించారు. ఇరువురి డాక్యుమెంట్‌లను పరిశీలించి రికార్డులను నమోదు చేశారు. జిల్లా పంచాయతీ అధికారికి విచారణ వివరాలు తెలియజేస్తానన్నారు. ఆయన వెంట ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, నాయకులు ఉన్నారు.

'డబుల్ రోడ్డు'కు నిధులు మంజూరు



భిక్కనూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు: మండల కేంద్రం నుంచి రాజంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 25కోట్ల నిధులను మంజూరు చేసిందని ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌తో కలిసి మాట్లాడారు. ఈ రోడ్డు నిర్మాణంతో 13 గ్రామాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు వెంకట్‌రెడ్డి, సిద్ధారెడ్డి, బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధమవ్వాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ గంగారెడ్డి

నాగిరెడ్డిపేట: యాసంగిలో సాగుచేసిన ధాన్యాన్ని సేకరించేందుకు సొసైటీ సిబ్బంది సన్నద్ధమవ్వాలని మండలంలోని తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి సూచించారు. మండలంలోని తాండూర్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన పాలక వర్గ సభ్యుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దీంతోపాటు మండలంలోని మెల్లకుంట తండా వద్ద నిర్మిస్తున్న 500 మెట్రిక్‌టన్నుల గోదాం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో సొసైటీ సీఈవో జైపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బాబురావు, డైరెక్టర్లు సంగయ్య, విజయ్ కుమార్, సిద్ధిరాంరెడ్డి, హనుమానాయక్, బన్సీ నాయక్, కిషన్ నాయక్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి



బాన్సువాడ రూరల్ : గ్రామాభివృద్ధి కోసం ఇంటి యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని బోర్లం జీపీ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో పంచాయతీ కార్యదర్శుల బృందంతో కలిసి పాల్గొన్నారు. సీపీ కార్యదర్శి సాయికుమార్, పండరి, సిబ్బంది భాస్కర్ పంతులు, సయ్యద్ జాఫర్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు వసతుల కల్పనే లక్ష్యం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ గాలిరెడ్డి

భిక్కనూరు : గ్రామీణ ప్రజల మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, కాంగ్రెస్ నేతలు నర్సింలు, స్వామి, భాగయ్య, బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో స్వామి వారి ఊరేగింపు



బాన్సువాడ: బీర్కూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీసమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం స్వామి వారిని మాడవీధుల్లో శేషవాహనం, సింహవాహనంపై ఊరేగించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీలో చేరిక



బాన్సువాడ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బాన్సువాడకు చెందిన వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి బీజేపీలో చేరారు. బీఆర్ఎస్‌లో ఉన్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, హిందూ సంఘాల నాయకులు సాయి, సిద్ధార్థ బీజేపీలో చేరారు. ఎంపీ బీబీ పాటిల్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, సాయికిరణ్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

డబుల్ ఓటర్లను గుర్తించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : డబుల్ ఓటర్లను గుర్తించే బాధ్యత బీఎల్‌వోలదేనని తహసీల్దార్ గంగాసాగర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఖాజాషరీఫ్ బీఎల్‌వోల సూపర్‌వైజర్ లింగాపురం రాజు, ధర్మపురి, జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. గత మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు మనోహర్‌రావు తండ్రి శ్రీహరిరావు ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, సిద్దిరాములు, సంజీవులు, రవి, బాలయ్య, గ్రామపెద్దలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దుకాణాలకు అనుమతివ్వండి



ఎల్లారెడ్డి రూరల్ (ఎల్లారెడ్డి) : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ సమయంలో దుకాణాలను తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతు ఫొటో స్టూడియో, మీసేవ నిర్వాహకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఏప్రిల్ 25 నుంచి మే 4వ తేదీ వరకు జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల వల్ల దుకాణాలు మూసి ఉంచడంతో ఉపాధి కోల్పోతున్నామన్నారు.

రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా మార్చి నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీని ఆదివారం వరకు కొనసాగించనున్నారు. ఈ విషయాన్ని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతియాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక వేలం పాట

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇసుకను వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న పది ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు పీఎస్‌లో వేలం వేశారు. ఈ వేలంలో ప్రభుత్వానికి రూ. 36,400 ఆదాయం వచ్చినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ సమీపంలో జాతీయ రహదారి ఓ ఆటో బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ మీదుగా భీమ్‌గల్ వెళ్తున్న ఆటో చేపూర్ సమీపంలో ఓ దర్గా వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓ మహిళకు తలకు తీవ్ర గాయం కావడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి సమీపంలో మోర్ సూపర్ మార్కెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆర్మూర్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న పరకాల డిపోకు చెందిన బస్సు మోర్ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. కండక్టర్, స్థానికుల సహాయంతో గాయపడిన వృద్ధుడిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులోని గోపన్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్ రోడ్డు సమీపంలో పోచారం ప్రధాన కాలువపై పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోచారం ప్రధానకాలువపై పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారని చెప్పారు. వారి నుంచి రూ.5,290 నగదు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత



మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. విశ్వసనీయ సమాచారంతో సీపీ ఆదేశానుశారం దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు. అనుమతులు లేకుండా మొరం తరలించారని తేలడంతో కేసులు నమోదు చేశామని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని పెంటకూర్దు గ్రామానికి చెందిన సంజీవ్(38) అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపారు. సంజీవ్‌కు మతిస్థిమితం సరిగ్గా లేదన్నారు. ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



రజనీకాంత్ (ఫైల్)

సదాశివనగర్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శెకెల్లి రజనీకాంత్(24) కామారెడ్డిలో ఆటో మొబైల్ షాప్ పెట్టి నష్టపోయాడు. ఇంటి నిర్మాణం, కారు కోసం తీసుకున్న అప్పులు, ప్రతి నెల ఈఎంఐలు కట్టలేక మదనపడుతుండేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

బోధన్‌రూరల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన మల్లేశ్ (22) ఆత్మహ్యతకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మల్లేశ్‌కు పది నెలల కిత్రం మహారాష్ట్రకు చెందిన అమ్మాయితో వివాహం అయింది. భార్యాభర్తల మధ్య గొడవలు తల్తెతగా గ్రామపెద్దలు పలుమార్లు నచ్చచెప్పారు. ఇరువురి మధ్య సఖ్యత కుదరకపోవడంతో భార్య కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ శుక్రవారం గ్రామ శివారులోని వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

జీవితంపై విరక్తితో..



షౌకత్ అలీ(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన షేక్ షౌకత్ అలీ(35) గురువారం రాత్రి తన ఇంట్లో దులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షౌకత్‌అలీకి భార్య షబీనాతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం షబీనా భర్తతో గొడవపడి తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి అక్కడే ఉంటుంది. భార్య, పిల్లలు తన వద్ద లేకపోవడంతో షౌకత్ అలీ నిత్యం బాధపడుతూ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజు తెలిపారు. మృతుడి అన్న షేక్ మసూద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో ఒకరు..

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి- ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టాలపై మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడిని రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన కర్రెం గంగయ్య (58)గా గుర్తించారు. అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



షమియొద్దీన్ (ఫైల్)

సదాశివనగర్: సదాశివనగర్ శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. వివరాలు.. కామారెడ్డికి చెందిన సయ్యద్ షమియొద్దీన్(47), షరీఫ్ సదాశివనగర్‌లోని సాంచేపీర దర్గా వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకుని స్కూటీపై కామారెడ్డికి తిరుగు ప్రయాణం అయ్యారు. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వీరిని ఢీకొనడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ షమియొద్దీన్ మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

గాంధారి: చేపల వేటకు వెళ్లి రాంపూర్ గడ్డ తండాకు చెందిన రాత్లావత్ హరి(40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. హరి గురువారం రాత్రి పోతంగల్ శివారులోని యాతం చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. చెరువులో గుంతలు ఉండడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎం దొంగల కోసం గాలింపు

రుద్రూర్: రుద్రూర్‌లో ఏటీఎం చోరీకి పాల్పడ్డ దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారిపై చోరీ జరగడంతో పోలీసులు కేసును సవాల్‌గా తీసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగల ఆచూకీ కోసం గాలించారు. చోరీకి దొంగలు వినియోగించిన వాహనం మహారాష్ట్రలో లభ్యమైనట్లు తెలిసింది.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

లింగంపేట: డ్రంకన్ డ్రైవ్ కేసులో శుక్రవారం ఒకరిని జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని శెట్పల్లికి చెందిన భూపాల్ ఇటీవల వాహనాల తనిఖీలో మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయనను కోర్టులో ప్రవేశపెట్టగా రూ.500 జరిమానా, ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

18 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఎడపల్లి మండలంలోని జైతాపూర్‌కు చెందిన రవికృష్ణారెడ్డికి జడ్జి మూడు రోజులు జైలు శిక్ష వేసినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 18 మందికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపర్చారు. 18 మందికి మేజిస్ట్రేట్ రూ.18,300 జరిమానా విధించినట్లు ఏసీపీ చెప్పారు.

ఎడపల్లి ఏడీఈ సస్పెన్షన్

నిజామాబాద్‌నాగారం: ఎడపల్లి ఏడీఈ, ఏఈ మధ్య గొడవపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాలకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి స్పందించారు. సీఎండీ ఆదేశాలతో ఇప్పటికే విజిలెన్సు డీఈ ప్రభాకర్ విచారణ చేసి నివేదికను ఎస్ఈ ప్రభాకర్‌కు అందజేశారు. శుక్రవారం సీఎండీ వరుణ్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లాలోని విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. ఎడపల్లి ఏడీఈ లక్ష్మణ్‌నాయక్‌ను సస్పెండ్ చేశారు. ఏఈ వైఎస్ ప్రసాద్‌రెడ్డిని నిర్మల్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడపల్లి ఇన్‌చార్జి ఏడీఈగా బోధన్ ఏడీఈ సీసీ బెనర్జీ, ఏఈగా బోధన్ టౌన్ ఏఈ రవిచంద్రకు బాధ్యతలు అప్పగించారు.

ఇల్లు దగ్ధం



నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన బండి నాగవ్వ ఇల్లు శుక్రవారం ఉదయం కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని ఆర్ఐ హన్మండ్లు తెలిపారు. రూ.1.20లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు.